
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 16 జూలై 2024







- రైతు రుణమాఫీపై విధివిధానాలు విడుదల
- భూమి పాస్‌బుక్, రేషన్‌కార్డు ఉంటేనే అర్హత
- అందరికీ 'మాఫీ' వర్తింపుపై అనుమానాలు
- ప్రభుత్వ మార్గదర్శకాలపై రైతుల్లో తీవ్ర చర్చ
- పూర్తిస్థాయి పరిశీలన తరువాతనే స్పష్టత వస్తుందంటున్న అధికారులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతు రుణమాఫీపై కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలో సోమవారం రూ.2లక్షల రుణమాఫీ అమలుకు విధివిధానాలు విడుదల చేసింది. ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం తమకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా అని రైతులు ఆరా తీస్తున్నారు. రూ2లక్షల వరకు రుణమాఫీ అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. విధివిధానాల్లో అందరికీ రుణమాఫీ లభించకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలు తప్పనిసరి చేయడంతో రేషన్‌కార్డు లేని రైతులు గందరగోళానికి గురవుతున్నారు.

ఇదీ.. విధానం !

ఖమ్మం, జూలై 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల ముందు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. వరంగల్ రైతు డిక్లరేషన్‌లోనూ రాహుల్‌గాంధీ దీనిపై హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని ప్రకటించారు. ఆగస్టు 15నాటికి ఒకేసారి రుణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ పథకాన్ని అమలుచేసే బాధ్యతను వ్యవసాయశాఖకు, బ్యాంకులకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం విధివిధానాలు విడుదల చేసింది. ఆ ప్రకారం రుణమాఫీ పొందాలంటే తెలంగాణ రాష్ట్రంలో భూమి ఉండాలి. 2018 డిసెంబరు 12నుంచి 2023 డిసెంబరు 9వరకు రుణాలు తీసుకుని ఉండాలి. కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ వర్తించనుంది. స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే ఈ పథకం ద్వారా మాఫీ వర్తిస్తుంది. సహకార, వాణిజ్య బ్యాంకులలో రుణాలు పొందిన వారికి ఈ పథకం వర్తించనుంది. రుణమాఫీ అమలు చేసేందుకు ప్రతి బ్యాంకులోనూ ఒక లైజన్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రభుత్వం సూచించింది.

ఉమ్మడి జిల్లాలో రైతురుణ జాబితా ఇలా..

ఉమ్మడి జిల్లాలో గత డిసెంబర్ 31వరకు ఖమ్మం జిల్లాలో మొత్తం 3,73,157మంది రైతులు రూ.4307.58 కోట్ల రుణాలు తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,86,034 మంది రైతులు రూ.1816.35 కోట్లు రుణాలు తీసుకున్నారు. రెండు జిల్లాల్లోనూ రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులున్నారు. అయితే వీరిలో రూ.2లక్షల లోపు రుణం తీసుకున్నవారు ఎంతమంది రైతులున్నారన్నది వ్యవసాయశాఖ, బ్యాంకర్లు తేల్చాల్సి ఉంది. రుణమాఫీ పొందేందుకు అర్హత నిబంధనలు జీవో ఆధారంగా జిల్లాలో ఎంతమంది రైతులకు రుణమాఫీ వర్తింస్తుదన్న విషయంపై అధికారులు కసరత్తు చేయనున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇరు జిల్లాల్లో 70శాతం రైతులు రుణమాఫీ పొందే అవకాశం ఉంది.

ప్రతిబంధకంగా సరిహద్దు, ఏజెన్సీ సమస్యలు..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతు రుణమాఫీ విషయంలో పలు సమస్యలు ఎదురుకాబోతున్నాయి. తెలంగాణలో వ్యవసాయ భూములుండి సరిహద్దున ఉన్న ఏపీలోని కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రైతులు ఉమ్మడి రాష్ట్రం నుంచి జిల్లాకు చెందిన సహకారసంఘాలు, వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటూ చెల్లిస్తూ వస్తున్నారు. ఆయా రైతులకు రైతుబంధు కూడా వచ్చింది. అయితే ఆయా రైతులకు ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తుందా లేదా అన్నది ప్రశ్నగా మారింది. అలాగే చాలమంది రైతులకు రేషన్‌కార్డులు కూడా లేవు. కొందరికి గతంలో రేషన్ కార్డులున్నా తాజాగా కుటుంబాలు వేరైనా కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో చాలా మంది రుణమాఫీకి అనర్హులుగా మిగిలే అవకాశం ఉంది. పాసుపుస్తకం ద్వారా రుణాలు పొంది రేషన్‌కార్డులు లేని రైతులకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. అలాగే ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉండడంతో చాలామంది వ్యవసాయరుణాలు, పట్టాలు లేకుండా పహణీలపై తీసుకున్నారు. ఇలాంటి రైతుల పరిస్థితి ఏంటన్నది తేలాల్సి ఉంది. పట్టాలు లేని రైతులు, కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నా భూఆధారం లేకపోవడంతో రుణాలు పొందలేకపోతున్నారు. అటువంటివారిలో కొందరు వ్యక్తిగత పూచీకత్తులపై వ్యవసాయ రుణాలు పొందుతూ వస్తున్నారు. ఈ రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశం లేదు. అయితే పూర్తిస్థాయిలో నిబంధనలు వచ్చిన తర్వాతనే రైతు రుణమాఫీకి ఎవరు అర్హులో చెప్పగలమని, తమకు ఇంకా ప్రభుత్వ జీవో కాపీ అందలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా రుణమాఫీ పథకంపై ప్రభుత్వం విడుదల చేసిన విధివిధనాలపై రైతుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.





ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

ఆయిల్‌పామ్ సాగుకు యాక్షన్ ప్లాన్

- 11,500 ఎకరాల్లో ప్లాంటేషన్ లక్ష్యం
- జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ

ఖమ్మం వ్యవసాయం, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌ను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేయడానికి రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోన్న నేపథ్యంలో ఈ ఏడాది 11,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను వేయించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ తెలిపారు. యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా రైతులకు 90శాతం రాయితీపై మొక్కలు, అంతరపంట కోసం యాజమాన్యాలకు ఎకరాకు రూ.4,200 చొప్పున అందిస్తామని తెలిపారు. ఈ మధ్య కాలంలో కొంతమంది పామాయిల్ పంటపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, అలాంటి అపోహలను రైతులు నమ్మొద్దని కోరారు. ఈ పంట ఒకసారి నాటుకుంటే సుమారు 30సంవత్సరాల వరకు దిగుబడి లభిస్తుందని తెలిపారు. కోతుల బెడద గాని దొంగలు బెడద గానీ ఉండదన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడి కచ్చితంగా వస్తుందని తెలిపారు. ఒకవేళ తోటలో ఎక్కడైనా బెరుకు మొక్కలు గానీ లేదా ఆఫ్‌టైప్ మొక్కలు గానీ కనిపిస్తే ఫీల్డ్‌ఆఫీసర్లకు తెలియజేయాలని కోరారు. వారు వచ్చి చూసి ఆ మొక్కల స్థానంలో వేరే మొక్కలు ఇస్తారని తెలిపారు.

గర్భిణులకు వరద గండం!



బూర్గంపాడు నుంచి గర్భిణిని బోట్‌లో తీసుకొస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం(ఫైల్)

- జూలై, ఆగస్టులో గోదావరికి వరదల సమయం
- పరివాహక ప్రాంతంలోని గర్భిణుల రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఏజెన్సీలో మొత్తం 604మంది ముందస్తు గుర్తింపు
- హైరిస్క్ గర్భిణులు 109 మంది
- పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ గదులు
- భద్రాద్రి ఏరియా వైద్యశాలలో 100 పడకలు సిద్ధం
- వైద్యశాఖ ముందస్తు కసరత్తు

వివరాలు : 6లో

అక్కడ దాడులతో.. ఇక్కడ దడ

- ఏపీలో రేషన్ బియ్యం అక్రమాపై కొరడా
- తెలంగాణలో ఆందోళనలు

7

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- కుటుంబంలో చిచ్చుపెట్టిన ఏఆర్ కానిస్టేబుల్
- ఖమ్మం నగరంలో కలకలం

6

ఉపాధ్యాయురాలిపై వేటు

- అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఫలితం
- భారీ మొత్తంలో నగదు స్వాహా

6

ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ
- నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు..
- 21నుంచి 1.840 కేంద్రాల్లో ప్రారంభం

6



జల్లేపల్లి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- పల్లెలను విస్మరించిన గత ప్రభుత్వం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జల్లేపల్లిలో జ్వర బాధితులకు పరామర్శ

తిరుమలాయపాలెం, జూలై 15: పాలేరు నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తాను పాలుపంచుకుంటానని, ప్రజలకు అండగా ఉంటానని, అధైర్యపడొద్దని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామాన్ని సోమవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి సందర్శించారు. గ్రామంలో విషజ్వరాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని మంత్రి పొంగులేటి కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రస్తుతం జ్వరాల సీజన్ అని, డెంగు, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్తనమూనాలు సేకరించి వారికి అవసరమైన మందులు, దోమతెరలు అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలందిస్తామని పేర్కొన్నారు. మురికిగుంతలు, పెంటకుప్పలు దర్శనమిస్తున్నాయని వాటిని తొలిగించాలని ఆదేశించారు. వీధులు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రాకుండా ఎలా ఉంటాయని ప్రశ్నించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. జ్వరాలు తగ్గే వరకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించాలన్నారు.

పల్లెలను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

పల్లె ప్రాంతాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని, కనీసం గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కూడా లేవని మంత్ర పొంగులేటి విమర్శించారు. తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గ్రామాల్లో బీటీరోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి వ్యవస్థను పట్టించుకోలేదన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలను అక్కడి ప్రజలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాలతి, డీసీహెచ్‌వో రాజశేఖర్, ఎంపీపీ బోడ మంగిలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీను, తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో శేషాద్రి, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావ శివరామకృష్ణ, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కోరుకున్న చోట పోస్టింగ్

పూర్తయిన పంచాయతీ కార్యదర్శుల కౌన్సిలింగ్ ● పలువురికి ఫోన్‌లో ముఖాముఖి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 15: బదిలీలకి అర్హత, సీనియారిటీ ఉన్న పంచాయతీ కార్యదర్శులకు వారు కోరుకున్న చోట అధికారులు పోస్టింగ్ కల్పించారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో సోమవారం పంచాయతీ సెక్రటరీలకు, ఎంపీవోల బదిలీలకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. సీనియార్టీ జాబితా ప్రకారం, 40శాతం మందికి పోస్టింగులు కల్పించారు. జిల్లాలోని మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు గ్రేడ్ల వారీగా బదిలీలు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 179మందికి బదిలీలకు జాబితాను ప్రకటించింది. వీరికి సీనియారిటీ ప్రకారం పోస్టింగు కల్పించారు. సోమవారం నలుగురు ఎంపీవోలకు ఫోన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించారు. తిరుమలాయపాలెం సెక్రటరీ కూడా ఫోన్ ద్వారా కౌన్సిలింగ్‌లో పాల్గొంది. మంత్రుల పర్యటనలో ఉన్న వారికి ఈ విధానంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇచ్చారు. మిగిలిన గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4 సెక్రటరీలు ముఖాముఖీగా హాజరయ్యారు. వారందరినీ వరుసక్రమంలో పిలిచి పోస్టింగ్‌లు కేటాయించారు. కౌన్సిలింగ్ ప్రక్రియకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య, జడ్పీ సీఈవో ఎస్ వినోద్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ పాల్గొన్నారు. వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఆప్షన్ల ప్రకారం పోస్టింగ్ ఇచ్చారు. వారికి ఉత్తర్వులు కూడా అందచేసినట్లు డీపీవో తెలిపారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో, డీపీవో తదితరులు

గ్రామసభ తీర్మానంతో పండితాపురం సంత అప్పగింత

- రూ. కోటి 46లక్షల 10వేలకు ఆమోదం
- వేలంలో మద్దతు ధర రాకపోవడంతో హెచ్చుపాటదారుడికి అప్పగింత

కామేపల్లి, జులై 15: కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని శ్రీ క్రిష్ణ ప్రసాద్ పశువుల సంత వేలంపాట తొలిసారి గ్రామసభ తీర్మానంతో నిర్ణయించి కేటాయించారు. ఈ సంత మద్దుతు ధర రూ.కోటి 84లక్షల 70వేల 646 ఉండగా ఇటీవల మూడుసార్లు వేలం పాట నిర్వహించినా రూ.కోటి 30లక్షల వరకే వేలం పాట ఆగిపోవడంతో మద్దతు ధర రాకపోవడంతో అధికారులు మూడుసార్లు వాయిదా వేశారు. చివరిసారి జూలై 1న భూక్య వీరన్న అనే వ్యక్తి అత్యధికంగా రూ.కోటి 46లక్షల 10వేలకు పాట పాడాడు. దాంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించి హెచ్చు పాటదారుడికి సంత అప్పజెప్పాలని నిర్ణయించడంతో సోమవారం సంత ఆవరణంలో ఎంపీడీవో రవీందర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 400మంది హాజరైన ఈ సభలో హెచ్చు పాటదారుడైన భూక్య వీరన్నకు సంత కేటాయించడంపై అభిప్రాయన్ని చేతులు ఎత్తి తెలపాలని అధికారులు కోరగా వారిలో 327మంది మద్దతుగా నిలిచారు. అత్యధిక ప్రజల మద్దతు ఉండడంతో సంతను భూక్య వీరన్నకు కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కామేపల్లి ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144సెక్షన్ విధించారు. కార్యక్రమంలో ఎంపీవోలు రాజారావు, జీవీ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్ ధనియాకుల హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శులు గుగులోత్ నెహ్రూ, పెంద్ర అనిల్‌కుమార్, కోటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చేతులు ఎత్తి మద్దతు తెలుపుతున్న ప్రజలు

మినీ బడిబాట !

- జిల్లాలో ప్రారంభమైన 'అమ్మమాట అంగన్‌వాడీ బాట'
- 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- రెండేళ్లు నిండినవారిని కేంద్రాల్లో చేర్చేలా కసరత్తు
- ఐదేళ్లు నిండిన విద్యార్థులకు ధ్రువపత్రాల అందజేత

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 15: ఖమ్మం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు ప్రారంభమయ్యారు. జిల్లాలోని ఏడు ప్రాజెక్టు పరిధిలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేందుకు ఇష్టపడని లబ్ధిదారులు ఈ కొత్త పథకంతో కేంద్రాలకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండేది. అయితే ఈ కొత్త పథకంతో అంగన్‌వాడీ కేంద్రాలు సరికొత్త రూపం సంతరించుకోనున్నాయి. రెండున్నరేళ్ల వయసు వారి నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ఆకర్షితులయ్యేలా ప్రతి అంశంలోనూ మెరుగుపడనున్నాయి. ఓ వైపు కేంద్రాలను కొత్త విధానంలోకి తీసుకురావడంతో పాటు, మరోవైపు బలోపేతం చేసేందుకు సోమవారం నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీల్లో బోధించే విద్య, అందించే సేవల గురించి టీచర్లు పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తారు. కొత్తగా చేరబోయే పిల్లలకు 20న సామూహిక అక్షరాభ్యాసాలు చేయించనున్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకొని అంగన్‌వాడీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రి స్కూల్ సర్టిఫికెట్‌ను అందించనున్నారు. రెండున్నరేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసమే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పేదల పిల్లలకు కూడా ప్రైవేటు తరహాలోనే ప్రీస్కూల్ విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని డిడబ్ల్యూవో తెలిపారు. ఇందుకు అవసరమైన చర్యలు ఇప్పటికే చేపట్టామని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని 24వ డివిజన్ శాంతినగర్ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని సీడీపీవో కవిత, స్థానిక కార్పొరేటర్ కమర్తపు మురళీ ప్రారంభించారు.



'అమ్మమాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో కవిత, కార్పొరేటర్ కమర్తపు మురళి


రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్ ఇదీ..

సోమ, మంగళవారాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలల టీచర్లు, యువత, ఎన్జీవోలతో ర్యాలీ నిర్వహిస్తారు. రెండున్నరేళ్ల వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సంబంధిత సిబ్బంది కోరుతారు.

● 18న అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రెండున్నరేళ్ల వయసు దాటిన పిల్లలను గుర్తిస్తారు. తాము అందిస్తున్న బోధన, పాఠశాల విద్యకు సమాయత్తం చేయడం తదితర అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

● 19న స్వచ్ఛ అంగన్‌వాడీ కింద కేంద్రాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతారు. ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటుతారు. తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం, కిచెన్ గార్డెన్ సదుపాయాలను కల్పిస్తారు. జూలైలో బోధించబోయే, నిర్వహించే కార్యక్రమాలను వెల్లడిస్తారు.

● 20న అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నాయనమ్మ, అమ్మమ్మలను ముఖ్య అతిథులుగా పిలిచి బోధనా విధానం, పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తారు. పిల్లలను రోజూ అంగన్‌వాడీకి పంపుతున్న తల్లిదండ్రులకు బహుమతులు అందించనున్నారు. కార్యక్రమాలతో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల సంఖ్య పెరిగేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి.



కిన్నెరసానికి జలకళ

- ప్రాజెక్టులో 402అడుగులకు చేరిన నీటిమట్టం

పాల్వంచ రూరల్, జూలై 15: భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది. ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం 402అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి 2,200క్యూసెక్కుల నీరు జలాశయానికి వస్తోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 407 అడుగులు కాగా 405 అడుగులకు చేరుకుంటే పైనుంచి వచ్చే వరదనీటిని కిందికి విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు సమాయత్తమవుతున్నారు.

ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ
- నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు..
- 21వ తేదీ నుంచి 1.840 కేంద్రాల్లో ప్రారంభం



నగరంలోని బుర్హాన్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యను బోధిస్తున్న టీచర్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 15: మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నూతనంగా అంగన్వాడీ కేంద్రాలను పూర్వప్రాథమిక పాఠశాలలుగా తీర్చిదిద్దాలని పలు నూతన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తొలిదశలో పూర్వప్రాథమిక పాఠశాల కేంద్రాలుగా ప్రీ ప్రైమరీ స్కూల్స్ గా మార్చనున్నారు. రెండున్నర సంవత్సరాల చిన్నారులను నర్సరీ, 3నుంచి 4 సంవత్సరాల చిన్నారులను ఎల్‌కేజీ, 4నుంచి 5 సంవత్సరాల పిల్లలను యూకేజీగా విభజించి వారికి పూర్వ ప్రాథమిక విద్యా అనుభూతులు అందిస్తారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అన్ని స్థాయిలలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ టీచర్లను 48 బ్యాచ్‌లుగా తయారు చేసి ఒక్కో బ్యాచ్‌లో 36 మంది చొప్పున ఈ ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఆప్పటికే 43 బ్యాచ్‌లను శిక్షణ పూర్తికాగా, 5బ్యాచ్‌లకు శిక్షణ అందించాల్సిఉంది. శిక్షణ పూర్తైన కేంద్రాల్లో ఇప్పటికే ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్నారు. ప్రియదర్శిని పేరుతో ప్రతి ఏడాది మూడుసార్లు సిలబస్ పుస్తకాలను విడుదల చేస్తారు. ప్రతి ప్రియదర్శిని పుస్తకంలో అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు బోధించాల్సిన అంశాలు, మంచి అలవాట్లు, పాటలు సంభాషణ, కథలు, శాస్త్రీయ పరిజ్ఞానం, సృజనాత్మకత, ఇంగ్లీష్, తెలుగు, పూర్వ గణిత భవనాలు (శారీరక అభివృద్ధి, భాష అభివృద్ధి సృజనాత్మక అభివృద్ధి) వివరంగా ఉంటాయి.

పూర్వ ప్రాథమిక విద్య నిర్వహణకు సంబంధించి పూర్వ ప్రాథమిక విద్యా కరదీపిక పుస్తకం కూడా ఇస్తారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు ప్రాథమిక పాఠశాల బడికి సన్నద్ధం చేస్తారు. జాతీయ నూతన విద్యా విధానం 2020 ప్రకారం ఫౌండేషనల్‌స్టేజ్ ప్రాథమిక స్థాయిలో ఐదు సంవత్సరాల వరకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాల్సి ఉంటుంది. అందులో మొదటి మూడు సంవత్సరాల్లో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు అంగన్వాడీ కేంద్ర పరిధిలో ఉంటారు. తర్వాత ఒకటవ - రెండవ తరగతి కోసం ప్రాథమిక పాఠశాలకు వెళతారు. అంగన్‌వాడీ ప్రీ స్కూల్ పిల్లలకు కూడా ఏకరూప దుస్తులు ఇస్తారు. ఇవన్నీ కూడా ఒకటే స్థలంలో ఉంటే ఈ ఫౌండేషన్ స్థాయిని సమర్థవంతంగా నిర్వహించినట్లు అవుతుంది. ఇదే విషయాన్ని ప్రజల సమక్షంలో తల్లిదండ్రులందరికీ వివరిస్తారు. పిల్లలకు సంబంధించిన వర్క్ బుక్ పుస్తకాలు బొమ్మలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అంగన్‌వాడీ టీచర్లు సొంతంగా తయారు చేసుకుంటారు. ప్రియదర్శిని సిలబస్ పుస్తకాలు, కరదీపిక పుస్తకాలను అంగన్‌వాడి టీచర్లకు అందించారు. వీటిపై టీచర్లు చిన్నారులకు నూతన విద్యావిధానంతో ప్రీస్కూల్ విద్యను అందించనున్నారు.

1,746 మంది టీచర్లుకు శిక్షణ

ఖమ్మం జిల్లాలోని మొత్తం 1840 అంగన్‌వాడీ కేంద్రాలలో 1,746 మంది అంగన్‌వాడి టీచర్లుకు ఈ శిక్షణ అందిస్తున్నారు. జూలై 15 వరకు జిల్లాలో 1,561 మంది టీచర్లకు శిక్షణ పూర్తికాగా మిగిలిన 185 మంది టీచర్లకు ఈ నెల 20వ తేదీలోగా శిక్షణ పూర్తి చేసి ఈ నెల 21 నుంచి జిల్లాలోని 1840 అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ విద్యను అందించనున్నారు.

కేవీ సంఘటన్ సమస్యలు పరిష్కరిస్తాం

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీ

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 15: ఖమ్మంలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల సమస్యలపై కేంద్ర పభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హామీ ఇచ్చారు. కరుణగిరి ప్రాంతంలో గల కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలను సోమవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులలో తిరుగుతూ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ఎదురవుతున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బైపాస్ రోడ్డు నుంచి పాఠశాలకు వచ్చే దారిలో, ప్రధాన గేటు ముందు రోడ్డు సక్రమంగా లేదని, పాఠశాల ఆవరణలో కోతుల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు, అధ్యాపకులు ఎంపీకి విన్నవించారు. పాఠశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2013 నుంచి వేతనాలు పెంపుదల లేదని తద్వారా కాంట్రాక్టు అధ్యాపకులు ఆర్థికంగా ఇబ్బందులతు పడుతున్నారని ఉపాధ్యాయులు ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆయన మొక్కను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇల్లెందుకు సీతారామ నీరివ్వాలి: గుమ్మడి నర్సయ్య



ఎమ్మెల్యే రాందాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

వైరా, జూలై 15: గోదావరి నది జలాలను కృష్ణానది ఆయకట్టు గ్యారెంటీ కోసం తీసుకువెళ్లటానికి ముందే ఇల్లెందు ప్రాంతానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటి అవసరాలు తీర్చాలని గోదావరి జలాల సాధన కమిటీ ఇల్లెందు నియోజకవర్గం తరఫున మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఇల్లెందు ప్రాంత సాగునీటి అవసరాలు తీర్చిన తర్వాతనే బయటి ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు తీసుకువెళ్లాలని ఆవినతిపత్రంలో కోరారు. దీనికి భిన్నంగా వ్యవహరిస్తే ఏజన్సీ రైతాంగం ప్రతిఘటిస్తుందని ఇకనైనా ప్రజాప్రతినిధులు నోరు విప్పాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు ఏజన్సీ ప్రాంత సాగునీటి కోసం గోదావరి జలాల సాధన కమిటీ ద్వారా విన్నవిస్తున్నామని స్పష్టం చేశారు. గోదావరి జలాలు ఏఒక్కరి సొత్తు కాదని అందరికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా అందరిపై ఉందన్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆతర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌లు చేసిన శంకుస్థాపనలు ఇతర అంశాలను ఆవినతిపత్రంలో ప్రస్తావించారు.

అర్చకుల బదిలీలను ఆపండి

మంత్రి పొంగులేటికి భద్రాద్రి దేవస్థానం వైదిక సిబ్బంది వినతి



మంత్రిని కలిసిన వైదిక సిబ్బంది

భద్రాచలం, జూలై 15: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో శతాబ్దాల కాలం నుంచి వంశపారంపర్యంగా వస్తున్న అర్చకుల బదిలీలను ఆపాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి భద్రాద్రి దేవస్థానం వైదిక సిబ్బంది విన్నవించారు. సోమవారం వారు ఖమ్మంలో మంత్రిని కలిసిన దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు కలిసారు. ఈ సందర్భంగా వారు శతాబ్దాల కాలంగా భద్రాద్రి రామాలయంలో రామయ్యకు పూజాది కార్యక్రమాలు నిర్వహించేందుకు భక్తరామదాసు తీసుకొచ్చిన ఐదింటి పేర్లవారే నేటికి పూజా కార్యక్రమాల్లో కీలక పాత్ర వహిస్తున్నారని గుర్తు చేశారు. పూర్తి సంప్రదాయబద్ధంగా, పాంచరాత్రగమశాస్త్రం అనుగుణంగా పూజలు నిర్వహించే ఈ ఆలయంలో అర్చకుల బదిలీలను నిలిపివేసేలా చూడాలని వారు మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి పొంగులేటి ఈ విషయం సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా అర్చకుల బదిలీలకు సంబంధించిన విషయం తీవ్ర చర్చనీయాంశ మైంది. ఈ క్రమంలో కొందరు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

కోతకు గురైన రహదారులు..

మరమ్మతులు చేయండి మహాప్రభో..



సత్తుపల్లిరూరల్, జూలై 15: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. నారాయణపురం గ్రామంలో వాగుదాటి వరదనీరు దాటికి రోడ్లు ఛిద్రమయ్యాయి. పెద్ద పాకలగూడెం, బేతుపల్లి గ్రామాల నుంచి రాళ్లగండి వాగు ద్వారా నారాయణపురం నల్లవాగు బంధం (నల్లవాగు) నుంచి రెండు పాయలుగా చీలుతుంది. ఒక పాయ తమ్మిలేరు వాగులో కలుస్తుండగా మరోపాయ తుంబూరు పెద్ద చెరువుకు చేరుతుంది.

వరద కారణంగా పెద్ద పాకలగూడెం, బేతుపల్లి, నారాయణపురంపంటపొలాల్లో మేట వేసిన ఇసుకను తొలగించాలి. తాళ్లమడ వెళ్లే రోడ్డులో భారీగా ఏర్పడిన గోతులతో ప్రమాదం పొంచి ఉంది.





గర్భిణులకు వరద గండం!



హెలికాప్టర్‌లో గర్భిణీని తీసుకొస్తున్న దృశ్యం(ఫైల్)

భద్రాచలం, జూలై 15: ప్రతి గర్భిణికి ప్రసవ సమయం ఓ గండం లాంటిదే. అలాంటిది గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గర్భిణులకు వర్షాకాలం వచ్చిందంటే మరోగండం ఎదురవుతుంది. ప్రసవ సమయంలో గోదవరికి వరదలు వస్తే వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంటుంది. గతంలో వరదల సమయంలో ఎంతోమంది తీవ్ర అవస్థలపాలైన సందర్భాలున్నాయి. ముఖ్యంగా భద్రాచలం వద్ద గోదావరి 60 అడుగులు దాటి ప్రవహిస్తే ప్రధాన రహదారులపై రాకపోకలు పూర్తిగా స్తంభిస్తాయి. దీంతో గర్భిణులను వైద్యశాలలకు తరలించడం కష్టసాధ్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా జిల్లా అధికార యంత్రాంగం, వైద్యఆరోగ్యశాఖ అధికారులు వరదల వేళ గర్భిణుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. వరదల సమయంలో గర్భిణులను ముందుగానే గుర్తించి గోదావరి తొలి ప్రమాద హెచ్చరికకు చేరుకోగానే వారిని సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ సమయంలో ప్రసవం క్లిష్టమవుతుందని ముందుగా గుర్తిస్తే రెండో ప్రమాద హెచ్చరిక చేరే లోపే మెరుగైన వైద్యం కోసం భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలకు తరలించి అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డుల్లో చేర్పుతున్నారు.

ఈ పీహెచ్‌సీల పరిధిలోనే గర్భిణులకు గండం..

గోదావరి పరివాహక ప్రాంతంలోని కరకగూడెం, పినపాక, జానంపేట, మోరంపల్లి బంజర, నర్సపురం, దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, అశ్వాపురం, పర్ణశాల, సత్యనారాయణపురం పీహెచ్‌సీల పరిధిలోని గర్భిణులను తొలి ప్రమాద హెచ్చరిక సమయానికే పీహెచ్‌లకు చేరుస్తారు. ఈ క్రమంలో సాధారణ ప్రసవం సాధ్యమవుతుందని భావించినవారిని అక్కడే ఉంచుతారు. వరదల సమయంలో 24 గంటలు వైద్యసేవలందించేందుకు సిద్దంగా ఉంటాయని వైద్యవర్గాలు తెలిపాయి. చర్ల, సత్యనారాయణపురం, దుమ్ముగూడెం, పినపాక 24 గంటల వైద్యశాలలతో పాటు మణుగూరు ఏరియా వైద్యశాలలో బర్త్ వెయిటింగ్ సిద్దంగా ఉండటంతో అందులో గర్భిణులను ఉంచి వైద్యం అందిస్తారు. ఇదిలా ఉండగా గోదావరి రెండో ప్రమాద హెచ్చరికకు చేరగానే హైరిస్క్ గర్భిణులను భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలకు తరలిస్తారు. కొన్ని సందర్భాల్లో ముందస్తుగా ప్రసవ వేదనకు గురవుతున్న వారిని గుర్తించి హెలికాప్టర్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ద్వారా ప్రత్యేక పడవలో ఏరియా వైద్యశాలకు తరలించిన సందర్భాలూ ఉన్నాయి.

హైరిస్క్ గర్భిణులు 109 మంది

గోదావరి పరివాహక ప్రాంత పరిధిలోని పది పీహెచ్‌సీల్లో 604 మంది గర్భిణులకు జూలై, ఆగస్టు నెలల్లో ప్రసవం వచ్చే అవకాశాలున్నట్లు వైద్యశాఖ సిబ్బంది గుర్తించారు. వీరిలో 109 మంది హైరిస్క్ గర్భిణలుగా గుర్తించి ముందస్తుగా వారిని భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలకు పంపనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందుకోసం భద్రాచలం ఏరియా వైద్యశాలలో వంద బెడ్లను ప్రత్యేకంగా కేటాయించారు. అలాగే మణుగూరు ఏరియా వైద్యశాలలో 50 బెడ్లు సిద్ధంగా ఉంచారు. పంచాయతీ, రెవిన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో గర్భిణులను తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

గర్భిణుల రక్షణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం

- డాక్టర్ ఆర్.చైతన్య, మాతా శిశు విభాగం జిల్లా ప్రోగ్రాం అధికారి



జూలై, ఆగస్టులో ఎంతమంది గర్భిణులు ప్రసవించే అవకాశం ఉందో ఇప్పటికే గుర్తించాం. అలాంటి వారిని వరదల సమయంలో ముందస్తుగా తరలించి ప్రసవం నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ఆరు పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ రూములను ఏర్పాటు చేశాం. అలాగే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచుతున్నాం.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కుటుంబంలో చిచ్చుపెట్టిన ఏఆర్ కానిస్టేబుల్
- మాయమాటలతో వివాహితను లోబరుచుకున్న వైనం
- తన భర్తే ప్రోత్సహించాడని మహిళ ఆరోపణ
- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన భర్త
- ఖమ్మం నగరంలో కలకలం

ఖమ్మంక్రైం, జూలై 15: పచ్చని కాపురంలో ఓ ఏఆర్ కానిస్టేబుల్ చిచ్చుపెట్టాడు. చెల్లి, బుజ్జీ అంటూ ఇంటికి వచ్చి మాయమాటలు చెప్పి వివాహితతో సన్నిహితంగా వ్యవహరించాడు. చివరకు ఆమెను వలలో వేసుకొని ఇద్దరూ కలిసి భర్తను చంపేందుకు కుట్రపన్నారు. ఈ కుట్రను సదరు భర్త గుర్తించి ఆధారాలతో ఏఆర్ కానిస్టేబుల్‌తో పాటు తన భార్యపై కేసు పెట్టాడు. వారిద్దరిపై కేసు నమోదైంది. అయినా పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకోలేదని ఆవేదనతో బాధిత వ్యక్తి పలురకాల మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం అతడు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ తాటి రాంబాబు ఖమ్మం నగరంలోని బాంబు డిస్పోజల్ విభాగంలో పని చేస్తూ ఖమ్మంలోనే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎనిమిది నెలల క్రితం అతడికి ఓ వివాహితతో అతడికి పరిచయం ఏర్పడింది. మొదట చెల్లి, బుజ్జి అంటూ మాట కలిపి కొద్ది రోజుల తర్వాత సదరు వివాహితను మాయమాటలతో లోబరుచుకున్నాడు. ఈ క్రమంలో వారిద్దరూ సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు ఏఆర్‌కానిస్టేబుల్‌తో పాటు సదరు వివాహిత సెల్‌ఫోన్‌లో రికార్డు చేసుకున్నారు. అయితే భార్య ప్రవర్తనపై అనుమానం వ్యక్తిన భర్త ఆమె సెల్‌ఫోన్‌ను తనిఖీ చేయగా వీడియోలు, ఫొటోలు లభ్యమయ్యాయి. దీంతో వాటి ఆధారంగా అతడు ఈ నెల 9నఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా తన భార్య, కానిస్టేబుల్ కలిసి తనను చంపేందుకు కుట్ర పన్నారని, జూన్ 6వ తేదీ రాత్రి వారు సన్నిహితంగా ఉన్నప్పుడు చూడగా ఇద్దరు కలిసి తనపై దాడి చేశారని, చంపుతానని బెదరించారని ఫిర్యాదులో పేర్కొనాడు. దీంతో వారిద్దరిపై ఖానాపురంహవేలి పోలీసులు కేసు నమోదుచేసి సదరు వివాహితను శనివారం స్టేషన్‌కు పిలిపించారు. నోటీసు ఇచ్చేందుకు పోలీసులు ఆమెతో మాట్లాడుతుండగా ఆమె పెట్రోల్ డబ్బా తీసుకుని, తనకేమీ తెలియదని, తన భర్తే కానిస్టేబుల్‌తో సన్నిహితంగా ఉండమని సూచించాడని ఆరోపించింది. తన భర్త ప్రోద్బలంతోనే తాను కానిస్టేబుల్‌తో సన్నిహితంగా ఉన్నానని పోలీసులకు తెలిపింది. దీంతో భర్త ఆవేదన చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న పలురకాల 30 మాత్రలు మింగాడు. అనంతరం తన పెద్దనాన్న అయిన తుమ్మకొమ్ము వెంకన్న ఇంటివద్దకు వెళ్లి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, తాను అందరికీ దూరంగా వెళ్లిపోతున్నానని ఏడ్చాడు. ఏం జరిగిందని వారు ఆరా తీయగా, తాను అధికమొత్తంలో మాత్రలు మింగానని తెలిపాడు. దాంతో వారు అతడిని వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సిబ్బంది తెలిపారు.

అవినీతి, అక్రమాలకు పాల్పడిన

ప్రభుత్వ ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

కొత్తగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు పలు అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆరోపణలపై విచారణలో బయటకు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ఉపాధ్యాయురాలిని విచారణ అధికారి సోమవారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయాలని కూడా విచారణ అధికారి స్వయంగా వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ అధికారి రామచంద్ర ఎయిడెడ్ పాఠశాల ప్రత్యేక అధికారి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కే. సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం..

కొత్తగూడెంలోని బూడిదగడ్డ ప్రాంతంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న టి. పద్మావతి అనే ఉపాధ్యాయురాలు 2004 నుంచి 2014 వరకు రామచంద్ర ఎయిడెడ్ పాఠశాలలో పని చేస్తున్న 9మంది ఉపాధ్యాయులకు సర్వీస్ రికార్డు ఇప్పిస్తానని, ఒక్కొక్క ఉపాధ్యాయుడి వద్ద నుంచి కొంత మొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు అప్పట్లో ఆమెపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. సంబంధిత ఉపాధాయులకు సర్వీస్ రిట్విఫికేషన్ చేయకుండ ఆ ఉపాధ్యాయులకు అన్యాయం చేసి కొంత నగదు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల ఏకరూప ప్రభుత్వ దుస్తులను రామచంద్ర ఎయిడెడ్ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందజేసి ప్రభుత్వ ఉపాధ్యాయులకు అన్యాయం చేసిందని ఆరోపణలు ఉన్నాయి.

కొత్తగూడెంలోని రామచంద్ర ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2010 నుంచి 2019 వరకు ఏటా ఒక తరగతిని మూసివేస్తూ వచ్చారు. దీంతో బాలికలకు సంబంధించిన పాఠశాలలో 1 నుంచి పదో తరగతి వరకు మొత్తం తరగతులను మూసివేశారు. దీంతో అక్కడ చదువుతున్న విద్యార్థులకు సుమారు 92మంది విద్యార్థులకు టీసీలు ఇచ్చి పంపించారనే ఆరోపణలు కూడా ఈ ఉపాధ్యాయురాలిపై ఉన్నాయి. ఆ పాఠశాలను మూసివేసిన అనంతరం ఉపాధ్యాయులను జడ్పీఎస్ ఆనందఖనికి డిప్యూటేషన్‌పై వేయించింది. తను మాత్రం కొత్తగూడెంలోని జడ్పీఎస్ హనుమాన్‌బస్తీ ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం పని చేస్తోంది. అదే పాఠశాలలో 7, 8 తరగతులు చదువుతున్న కొందరు బాలికలపై అసభ్యకరంగా పదజాలంతో మాట్లాడినట్లు అక్కడ పని చేసిన ఒక టీచర్ పై ఆరోపణలు రావడంతో ఈ ఉపాధ్యాయుడిని కూడా వెనకేసుకొచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రైవేట్ పాఠశాలకు చెందిన వారి నుంచి బహుమతులు కూడా పొందినట్లు ఆరోపణలు వినిపించాయి.

ఈ ఉపాధ్యాయురాలు భర్త గతంలో ఎంఈవోగా పని చేసేవారు. ఏసీజీ పరీక్షల అధికారి డిప్యూటీ డీఈవోగా కూడా పని చేశారు. తద్వారా భర్త అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు అప్పట్లో ప్రభుత్వ ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. 2023 ఆగస్టులో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అవినీతి అక్రమాలపై విచారణ అధికారిగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కే. సంజీవరావును నియమించారు. ఈ మేరకు గత ఏడాది నుంచి పలు ఆరోపణలపై సంజీవరావు పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి సాక్షాధారాలతో సహా దర్యాప్తు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పద్మావతి అనే ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసి, ఆమెపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ విచారణ అధికారి ఫిర్యాదు చేశారు.

వరద ప్రళయానికి రెండేళ్లు

● రాత్రికి రాత్రే...గ్రామం అంతా తరలింపు ● నేటికి మరిచిపోని గ్రామస్థులు



జలదిగ్బంధంలో బూర్గంపాడు(ఫైల్)

బూర్గంపాడు, జూలై 15: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ఆదికారులు ఒక్కసారిగా అప్రమత్తమై రాత్రికి..రాత్రే బూర్గంపాడుకి చెందిన సుమారు 1000మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన రోజుని నేటికి మరవని పరిస్థితి. 2022 జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని ఆదికారులు తొలుత బూర్గంపాడులో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసారు. 2022 జూలై 14న రాత్రి సమయంలో వరద ఉధ్రుతి 80అడుగులకు చేరుకుంటుందని ఉన్నాతాధికారులు తెలపడంతో స్థానిక ఆధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. దీంతో అప్పటికప్పుడు 20లారీల ద్వారా బూర్గంపాడు గ్రామ పంచాయతీ ప్రజలను మోరంపల్లిబంజర, లక్ష్మీపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. బూర్గంపాడు నుంచి బాధితులతో మోరంపల్లిబంజర పునరావాస కేంద్రానికి వెళుతున్న లారీ సంజీవరెడ్డి పాలెం గ్రామ శివారులో వరదలో చిక్కుకపోయింది. లారీలోని ప్రజలు భయాభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. లారీని ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు చేర్చడంతో ఊపిరిపీల్చుకున్నారు.

బూర్గంపాడుకు చెందిన సుమారు 500నుంచి 1000మంది వరకు ప్రజలు గ్రామంలో ఎత్తైనా భవనాలపై ఉండి తలదాచుకున్నారు. అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించిన ప్రాణాలకు బరి తెగించి అక్కడే ఉండిపోయారు. మరుసటి రోజు గౌతపురం కాలనీకి చెందిన వృద్ధులు, బాలింతలు, చిన్నారులను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెండేళ్ల క్రితం వచ్చిన వరద ఉధ్రుతిని తలచుకుని స్థానికులు నేటికి భయాందోళన చెందుతున్నారు. జూలై, ఆగష్టు నెలలలో ప్రాణాలను ప్రాణాలను అరచెతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈకేవైసీ అప్డేట్ పేరుతో నగదు స్వాహా

అశ్వారావుపేట రూరల్, జూలై 15: ఈకేవైసీ అప్డేట్ పేరుతో సైబర్ నేరగాళ్ల నగదు స్వాహా చేసిన ఘటన మండలంలో సోమవారం వెలుగుచూసింది. వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన మామిడి వెంకట మహాలక్ష్మి వాట్సాప్‌కు ఓ లింక్ వచ్చింది. లింక్‌పై ఆమె క్లిక్ చేయగా, కొద్దిసేపటి తరువాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి తాను యూనియన్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానని, ఈకేవైసీ అప్డేట్ చేయకపోతే బ్యాంక్ ఖాతా నిలిచిపోతుందని తెలిపారు. ఇలా యువతి మాట్లాడుతుండగానే తన రెండు ఖాతాల నుంచి రూ.10,700లు డ్రా అయినట్లుగా మెసేజ్ వచ్చింది. అనంతరం వినాయకపురం బ్యాంకు వెళ్లి వివరాలు తెలపగా తాము ఫోన్ చేయలేదని తెలిపారు. సైబర్ నేరగాళ్ల నగదు కాజేసినట్లు గుర్తించారు. ఘటనపై బాధిత యువతి సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసింది.

ఇంటింటి నల్లా సర్వేలో అవకతవకలు?

- సర్వేలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన అధికారులు
- పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని స్థానికుల డిమాండ్

దుమ్ముగూడెం, జూలై 15: మండలంలో మిషన్ భగీరథ పథకంలో వేసిన ఇంటింటి నల్లాల సర్వేలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వేలాది ఇళ్లకు నల్లాలు వేశామని గతంలో పనిచేసిన ఓ ఇంజనీరింగ్ అధికారి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతోపాటు, నిధుల వినియోగంలోనూ అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటి నల్లాల సంఖ్య తేల్చేందుకు గత కొద్ది రోజులుగా గ్రామపంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహిస్తున్నారు. అయితే గతంలో ఇచ్చిన నివేదికకు, ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో గుర్తించిన నల్లాల సంఖ్యల మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వ్యత్యాసాన్ని సరిచేసేందుకు గతంలో ఇక్కడ పనిచేసిన ఆ ఇంజనీరింగ్ అధికారి ఓ వ్యక్తిని పంపి గుమ్మస్తాల చేతిలో ఉన్న పలు గ్రామపంచాయతీల కార్యదర్శుల టాబ్‌ల నుంచి వేయని నల్లాలను అదనంగా అప్‌లోడ్ చేయించినట్లు సమాచారం. ఈ విషయమై కొందరు కార్యదర్శులు, సదరు అధికారితో వాదనకు దిగినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయి విచారణ చేపడితే మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ పనుల్లో రూ.లక్షలాదిల అవతకతవకలు బయటపడే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో ముత్యాలరావును వివరణ కోరగా, రెండు రోజుల్లో సర్వే పూర్తవుతుందని, అదనంగా ఎక్కడా ఎవరి ట్యాబ్‌ల నుంచి అప్‌లోడ్ జరగలేదన్నారు.

అక్కడ దాడులతో.. ఇక్కడ దడ

▸ ఏపీలో రేషన్‌దాడులపై ...తెలంగాణలో ఆందోళనలు ▸ ప్రతి ఏటా ఏపీకి కోట్లాది రూపాయల అక్రమరేషన్ సరఫరా

అశ్వారావుపేట, జూలై 15: కొద్ది రోజులుగా ఆంధ్ర ప్రదేశ్‌లో అక్రమ రేషన్ నిల్వలపై జరుగుతున్న దాడులు తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వందలాది కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోయాయి. ఇప్పటికే జరిగిన వందలాది కోట్ల రూపాయల లావాదేవీలకు సంబంధించి సొమ్ము వస్తుందా? రాదా? అనే ఆందోళన తెలంగాణ అక్రమ రేషన్ దందా నిర్వహిస్తున్న వ్యాపారుల్లో వ్యక్తం అవుతుంది. ఇన్నాళ్లు కష్టపడిన సొమ్ము నీళ్లపాలవుతుందనే ఆందోళనతో చాలా రోజులుగా తెలంగాణ అక్రమ రేషన్ దందా నిర్వహిస్తున్న వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.....

అక్కడ దాడులతో తెలంగాణ వ్యాపారుల సొమ్ము గాలిలో..

తెలంగాణలో నిత్యం వేల టన్నుల రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం కొన్ని సంవత్సరాలుగా యథేచ్ఛగా నడుస్తుందనేది బహిరంగ రహస్యం. వీటిని నియంత్రించాల్సిన పలుశాఖల అధికారులు అక్రమ రేషన్‌బియ్యం దందాకు రైట్ రైట్ అంటూ చెబుతుండటంతో అడ్డు అదుపులేకుండా అక్రమ రేషన్ బియ్యం దందా నడిచిపోతూ ఉంది. గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున జరిగిన ఈ అక్రమ రేషన్ దందా ప్రభుత్వం మారినప్పటికీ ఇప్పటికి కొనసాగుతూనే ఉంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ అక్రమ రేష న్ దందా యథేచ్ఛగా నడుస్తుంది. ప్రభుత్వం పేద ప్రజలకు కిలో రూపాయికి అందిస్తున్న బియ్యంలో 90శాతం బియ్యం తిరిగి బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. కొందరు లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి, బహిరంగ మార్కెట్‌లో విక్రయించేస్తున్నారు. రేషన్ డిపోల ద్వారానే సగం రేషన్ బియ్యం చీకటి దందా నడుస్తుందనేది బహిరంగ రహస్యం. వివిధ రూపాలలో సేకరణ చేయబడిన రేషన్ బియ్యాన్ని కొందరు వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి లారీలలో ఏపీకి తరలిస్తున్నారు. ఈ బియ్యం తరలింపు మార్గంలో అనేక ఆటంకాలు ఎదురవుతుండటం, తెలంగాణలోని పెద్ద పెద్ద వ్యాపారులు నేరుగా పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించడంతో ఇక్కడ వ్యాపారులకే ఈబియ్యాన్ని విక్రయించడం ప్రారంభించారు. ఏ పద్ధతులతోనైతేనేమి తెలంగాణ నుంచి ఏపీలోని ఓడ రేవుల వద్దకు ప్రతి రోజు వందల లారీలలో రేషన్ బియ్యం యథేచ్ఛగా రవాణా అవుతున్నాయి. అడపాదడపా సరిహద్దు చెక్ పోస్టులవద్ద, ఇతర ప్రాంతాలలో వందల టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటనలే దీనికి నిదర్శనం. అయితే పట్టుబడేది పిసిరంత, సరిహద్దులు దాటి వెళ్లేది కొండంత అని చెప్పవచ్చు. ఈ అక్రమ దందాలో ఏపీ, తెలంగాణాకు చెందిన బడా వ్యాపారులు అనేక మంది ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రేషన్ బియ్యం వాడరేవుల ద్వారా వివిధ దేశాలకు అధిక ధరలకు విక్రయిస్తూ వేల కోట్ల రూపాయల లావాదేవీలను నిర్వహిస్తున్నారు కొందరు బడాబాబులు. తెలంగాణ నుంచి విదేశాలకు వెళ్లాలన్న తప్పనిసరిగా ఏపీలోని ఓడరేవులకు చేరాల్సిందే. ఈ మొత్తం దందా వెనుక వివిధ శాఖల అధికారులే కాక రాజకీయ నేతల హస్తాలు కూడా ఉండకుండా జరిగే అవకాశం లేదనేది నిర్వివాదాంశం. ఇటీవల కొద్ది రోజులుగా ఏపీలో రేషన్‌బియ్యం అక్రమ నిల్వలు, వ్యాపార లావాదేవీలపై ఉక్కుపాదం మోపుతుంది. ఓడ రేవుల్లో గొడౌన్‌లలో ఉన్న లక్షల టన్నుల బియ్యం నిల్వలను పట్టుకున్నారు. రవాణా,



ఇతర అక్రమాలపై దృష్టి పెట్టింది. దీంతో ప్రస్తుతం తెలంగాణ నుంచి రేషన్ బియ్యాన్ని ఏపీలోకి పంపించడానికి ఆటంకం కలుగుతుంది.

ఇదిలా ఉంచితే ఇప్పటికే ఏపీలోకి తెలంగాణ నుంచి పంపించిన బియ్యానికి సంబంధించి రావాల్సిన నగదు లావాదేవీలు రూ.వందల కోట్లలోనే ఉంటుందనేది అనధికార అంచనా. నిత్యం ఈ ప్రాంతం నుంచి ఏపీకి వెళ్లే రేషన్ బియ్యానికి సంబంధించి సొమ్మును అక్కడి వ్యాపారులు వారం, పదిరోజుల్లో వీరికి చెల్లింపులు చేస్తుంటారు. ఈ విధంగా వందలాది కోట్ల రూపాయలు తెలంగాణ వ్యాపారుల సొమ్ము అక్కడ నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో తమకు రావాల్సిన సొమ్ములు పెండింగ్‌లో పడి పోతాయా? అనేది ఆందోళన కలిగిస్తుంది. అసలే ఇదంతా దొంగ వ్యాపారం. బిల్లులపై నడిచేది కాదు. ఇలాంటి పరిస్థితుల్లో తమ సొమ్ము అక్కడ నిలిచిపోతే పరిస్థితి ఏమిటనేదానిపై తెలంగాణలోని వ్యాపారుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. దాడుల్లో బియ్యం నిల్వలు పోయాయంటే అక్కడి వ్యాపారులు చేతులెత్తేస్తే తమ పరిస్థితి ఏమిటనేది వ్యాపారుల్లో వ్యక్తం అవుతుంది. ఏదేమైనా ఏపీలో రేషన్ బియ్యం అక్రమ దందాపై జరుగుతున్న దాడులు, తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తుంది.

పెన్షనర్స్‌కు పీఆర్సీని ప్రకటించాలి

● కలెక్టరేట్ ఎదుట పెన్షనర్స్ జేఏసీ నిరసన



సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 15: పెన్షనర్స్‌కు 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పెన్షనర్స్ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు కల్యాణం నాగేశ్వరరావు, గోపీచంద్, పరిశా పుల్లయ్య, ఉమా మహేశ్వరరావు, మహేశ్వరుడు, మధుసూదన్‌రావులు డిమాండ్ చేశారు. సోమవారం పదవీ విరమణ పొందిన ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట వీవీ పాలెం రహదారిపై పెన్షనర్స్ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెన్షనర్స్‌కు ఐదుడీఆర్లను పెండింగ్‌లో ఉంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జెల్లా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, కృష్ణమూర్తి, సీతరాములు, వైకుంఠరావు, మీరాఖాన్, బాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు శ్రీధర్, ఝాన్సీ, రముల్మ, కుటుంబ రావు కృష్ణారావు, వీరబాబు ఉన్నారు.

రామయ్యను దర్శించిన వారాహి పీఠాధిపతి



పూజల్లో పాల్గొన్న వారాహి పీఠాధిపతి వామనశర్మ

భద్రాచలం, జూలై 15: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారిని ఏపీలోని విశాఖపట్నంలో గల వారాహి శ్రీ విద్య పీఠం పీఠాధిపతి వామనశర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వైదిక సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు, ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. సోమవారం సీతామచంద్రస్వామివారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకల్యాణంలో 26 జంటలు పాల్గొన్నాయి.

భార్యపై భర్త దాడి
చికిత్స పొందుతూ భార్య మృతి

● కొత్తగూడెంలో ఘటన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై15: భార్యపై భర్త కర్రతో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరచగా, చికిత్స పొందుతూ భార్య మృతి చెందిన సంఘటన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని బర్లిఫీట్ ఏరియాకు చెందిన దాసరి శ్రీనివాస్ జిల్లా కోర్టులో గుమ్మాస్తాగా పని చేస్తున్నాడు. గత ఏడాది నుంచి మద్యానికి బానిసై ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రావు భార్య దాసరి పూర్ణ(50)తో తరుచూ గొడవ పడుతూ ఆమెపై దాడికి పాల్పడుతున్నాడు. ఇదే క్రమంలో ఈ నెల 11వ తేదీన కర్రతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం, హైదారాబాద్ ప్రాంతాలకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు.

కాగా సోమవారం కొత్తగూడెం మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది నిర్ధారించారు. మృతిరాలి కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు భర్త దాసరి శ్రీనివాస్‌రావుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీతారామ పనుల అడ్డగింత

▸ గోదావరి జలాలను భద్రాద్రి జిల్లా రైతులకు అందించాలని ఆందోళన

▸ రీ డిజైన్‌ను నిలుపుదల చేయాలని రైతుల డిమాండ్



వినోభానగర్ గ్రామంలో సీతారామ పనులను అడ్డుకుంటున్న నాయకులు

జూలూరుపాడు, జూలై 15: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా భద్రాద్రి జిల్లాలోని రైతులకు, జూలూరుపాడు మండలానికి గోదావరి జలాలను అందించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రీ డిజైన్‌ను నిలుపుదల చేసి పాత డిజైన్ ప్రకారమే పనులను చేపట్టి సాగునీటిని రైతులకు అందించాలని కోరుతూ సోమవారం మండల అఖిలపక్షం, రైతుసంఘాల నాయకులు కలిసి మండలంలోని వినోభానగర్‌లో సీతారామ పనులను అడ్డుకుని నిరసనను తెలియజేశారు. తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రీ డిజైన్ పేరుతో జలదోపిడికి పాల్పడుతూ, గోదావరి జలాలను ఆంధ్ర ప్రాంతానికి తరలించి జిల్లా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కె ఉమర్, సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీల మండల కార్యదర్శులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, గోపాలరావు, చాంద్‌పాషా, చందర్‌రావు, మధు, పొన్నెకంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

▸ బొగ్గు బావుల ప్రైవేటీకరణపై ఉద్యమ కార్యచరణ ▸ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తొలగించి, వాటి స్థానంలో తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సూర్యం విమర్శించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వీ. కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని తెలంగాణ అసెంబ్లీ నుంచి బిల్లును ఆమోదించి, కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనులను నూరుశాతం సింగరేణి సంస్థకే అప్పగించాలని పేర్కొన్నారు ఈఎస్ఐ, పీఎఫ్‌లకు వేతనాన్ని రూ.21వేలకు పరిమితం చేయడం ద్వారా, లక్షల మంది కార్మికులు ఆయా సౌకర్యాలను పొందలేక పోతున్నారని అన్నారు. కనీసం రూ.35వేల వరకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ, మునిసిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కార్మిక సంఘాలపై ఉందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న 24 ప్రధాన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఐఎఫ్‌టీయూ నుంచి విన్నవించేందుకు రాష్ట్ర కమిటీ కార్యాచరణ చేస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఎల్. పద్మ, ఏ. నరేందర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ. రామయ్య, కే. రాజన్న, వెంకటేష్, కే. రవి, యాకూబ్, షావలీ, మధుసూదన్‌రెడ్డి, వీ. ప్రవీణ్; సూర్యం, వెంకన్న, రాజేశ్వర్, జగన్, దేవాదానం పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదర్శనకు అదనపు బస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 15: గురుపౌర్ణమి రోజున అరుణాచలంలో నిర్వహించే గిరి ప్రదర్శనకు భక్తుల నుంచి ఆదరణ లభిస్తుండటంతో అవసరం మేరకు అదనపు సర్వీసులు నడుపపడానికి సిద్ధంగా ఉన్నామని రీజనల్ మేనేజర్ సరిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రీజయన్‌లో నడుస్తున్న రెండు సర్వీస్‌లకు అదనంగా, మరో సర్వీస్‌ను ఖమ్మం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చామని ఆర్ఎం తెలిపారు. ఈ సర్వీస్‌లకు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాల్సిందిగా భక్తులకు పేర్కొన్నారు. వివరాలకు ఖమ్మం, భద్రాచలం డిపోలలో సంప్రదించాలని తెలిపారు.

కొత్తగూడెంలో ఆర్టీసీ డిస్పెన్సరి...

ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోలలోని ఆర్టీసీ ఉద్యోగులకు ఖమ్మం నూతన బస్టాండ్‌లోని ఆర్టీసీ డిస్పెన్సరీలో మాత్రమే వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. దీంతో కొత్తగూడెం, భద్రాచలం, మణుగురు, ఇల్లెందు డిపోలకు చెందిన ఉద్యోగులకు ఇబ్బందిగా ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో కొత్తగూడెంలో అదనంగా మరో డిస్పెన్సరీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని, ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి డిపో ఉద్యోగులకు ఖమ్మం డిస్పెన్సరీలో, మిగిలిన డిపోల ఉద్యోగులకు కొత్తగూడెం డిస్పెన్సరీలలో వైద్య సేవలు అందుతాయని తెలిపారు.

25 వరకు డీఈఐఈడీ పరీక్ష ఫీజు

ఖమ్మం కానాపురంహవేలి జూలై 15: డీఈఐఈడీ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2022-24లో హాజరుకానున్న (రెగ్యులర్, ఒకసారి పరీక్ష రాసి ఉత్తీర్ణత పొందని)విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 25లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ లధికారి సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఆగస్టు 1తేదిలోగా చెల్లించవచ్చునని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలపై లేఖలు రాయాలి

▸ ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధ్రుతం చేస్తాం: సీఐటీయూ

▸ భద్రాద్రి జిల్లాలో ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ఎదుట ధర్నాలు



కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

కొత్తగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే జీవోలను రద్దు చేయాలని ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకి, ఐసీడీఎస్ డైరెక్టర్‌కు లేఖలు రాయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ధర్నాచేసి వినతిపత్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పెద్దఎత్తున ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కే. బ్రహ్మాచారి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం అమలు చేయని కారణంగానే పోరాటంలోకి రావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీల సమ్మెని, సమ్మె డిమాండ్లను బలపర్చిన నాయకులకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తర్వాత ఆ డిమాండ్ల పరిష్కారానికి వారు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలందరూ త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి. వీరన్న, సీఐటీయూ జిల్లా సహయ కార్యదర్శి కె. సత్య, ఉపాధ్యక్షుడు దొడ్డ రవి, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేస్, పద్మ, కళావతి, రమ్మ, భాను, శైలజ, అచ్చమ్మ, పద్మ, లక్ష్మి, సు జాత, వరలక్ష్మి, రత్నకుమారి, జుబేదా, నాగమణి, శశికళ, భాగ్యమ్మ, రమా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ సరఫరాను నిర్మూలించడానికి
ప్రత్యేక బృందాలు: సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూలై15: డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల సరఫరా వినియోగం, నియంత్రణపై ఈబృందాలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. ప్రధానంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీ అడిక్షన్ ప్రివెన్షన్ పైనా ప్రత్యేక దృష్టి పెట్టి పోలీస్‌శాఖ యాంటీనార్కోడ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల క్రయ, విక్రయాల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఫిర్యాదులు, సమాచారం అందజేసేందకు అందుబాటులో ఉండేందుకు 87126 59123 నెంబర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మాదకద్రవ్య సరఫరా, వినియోగం పైన సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీపీ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు, జూలై 15: మండలంలోని బేతాళపాడు గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్ఐ రాణాప్రతాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బేతాళపాడు గ్రామానికి చెందిన కురాకుల నాగయ్య అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని తన ఇంట్లో నిల్వ చేశాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి తన సిబ్బందితో కలిసి అతడి ఇంట్లో తనిఖీలు చేయగా, సుమారు 7 క్వింటాల బియ్యం పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకొని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెబ్బవరం బీసీ గురుకులాల తనిఖీ

▸ కలెక్టర్ ఆదేశాలతో గురుకులాలను సందర్శించిన అధికారులు ▸ గురుకులాల్లో సమస్యలపై ఆగ్రహం



ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న బీసీడబ్ల్యూవో జ్యోతి, ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న దృశ్యం

వైరా, జూలై 15: వైరా మండలం రెబ్బవరం గ్రామంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలల్లో అధ్వాన పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తీవ్రంగా స్పందించారు. 'ఒకే భవనంలో రెండు గురుకులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'తో పాటు ఇతర ప్రచార మాధ్యమాల్లో వచ్చిన కథనాలను కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. ఆగురుకులాల్లో అధ్వాన పరిస్థితులను పరిశీలించి వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జ్యోతి, బీసీ గురుకులాల ఆర్సీవో అంజలిని ఆదేశించారు. దీంతో ఆఇద్దరు అధికారిలు సోమవారం రెబ్బవరంలోని బీసీ గురుకుల పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఆసమయంలో అక్కడే ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులు అధ్వాన స్థితిగతుల గురించి వారి ముం దు ఏకరువు పెట్టారు. తమ పిల్లలు ఉండేందుకు సరైన వసతులు లేవ ని, నా ణ్యతలేని నాసిరకం అల్పాహారం, భోజనాలు పెడుతున్నారని, తాగునీటి సౌకర్యం లేదని, కనీసం రక్షణకు సంబంధించిన ప్రహరీ కూడా లేవంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు తమ గోడు విన్నించారు. ఈ గురుకులాలు నిర్వహిస్తున్న భవనంలోని ఏడు గదులను ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కోసం వినియోగించడం పట్ల అధికారి జ్యోతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే భవనంలో రెండు గురుకులాలు నిర్వహిస్తుండ గా, తరగతి గదులు కాకుండా ఏకంగా ఏడు గదులను సిబ్బం ది అవసరాల కోసం వినియోగించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కాంపౌండ్ లేకుండా పొలాల మధ్య రక్షణ లేకుం డా ఉన్న ఈ భవనాన్ని పరిశీలించిన ఆమె ఇదే మీ పిల్లలైతే రక్షణ లేకుండా ఇలాగే ఉంచుతారా అని ప్రిన్సిపాల్, సిబ్బందిని నిలదీశారు. కొన్నినెలల కిందటే ఇక్కడకు ప్రిన్సిపాల్‌గా వచ్చిన రాధిక తన అవసరాల నిమిత్తం మరో గదిని వినియోగించడం, ఆమెతోపాటు భర్త కూడా అక్కడే ఉండటాన్ని గమనించిన తప్పుబట్టారు. ఇంత అధ్వాన పరిస్థితులు ఎక్కడా చూడలేదని వ్యాఖ్యానించారు. వంటలను పరిశీలించారు. అలాగే ఆగురుకులాన్ని మరో ప్రాంతంలో ఏర్పాటు చేయటానికి గానూ వైరా, కొణిజర్ల ఇతర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

వారంలో మరో భవనంలోకి మార్పు: ఎమ్మెల్యే

గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరిశీలించారు. ఒకే భవనంలో రెండు పాఠశాలను నిర్వహిస్తున్నారని, వసతులు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. వారి గోడు విన్న ఎమ్మెల్యే వారంలో మరో భవనంలోకి మారుస్తామని, వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు



తల్లాడ, జూలై 15: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి నల్గొండ జిల్లా చౌటప్పల్ మండలం లక్కవరం వద్ద చోటు చేసుకుంది. తల్లాడ మండలం రెడ్డిగూడెం(కొడవటిమెట్ట) గ్రామానికి చెందిన మోదుగు ప్రభాకర్ అలియాస్ పుష్పరాజ్(30), అదే గ్రామానికి చెందిన మోదుగు విజయ్, శ్రీనులతో కలిసి హైదరాబాద్ నుంచి సెంట్రింగ్ సామన్లు మినీ వ్యాన్‌లో స్వగ్రామమైన రెడ్డిగూడేనికి తీసుకువస్తుండగా, మార్గమధ్యలో మినీవ్యాన్, కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మూటాపురంలో ఆక్రమణల తొలగింపు

నేలకొండపల్లి, జూలై15: మండల పరిధిలోని మూటాపురం గ్రామంలో రోడ్డును ఆక్రమించుకుని ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణలను తొలగించాలని ఎన్ని మార్లు చెప్పినా వినకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసుల సహాయంతో ఆక్రమణలను తొలగించినట్లు కార్యదర్శి నర్సింహారావు సోమవారం చెప్పారు.

మావోయిస్టుల స్తూపం కూల్చివేత



నక్సల్స్ స్తూపాన్ని కూల్చివేసిన పోలీస్ బలగాలు

చర్ల, జూలై 15: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో మావోయిస్టులకు చెందిన భారీ స్తూపాన్ని డీఆర్‌జీ బలగాలు సోమవారం కూల్చివేశాయి. గత కొద్ది రోజులుగా ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాలో కేంద్ర బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి. సోమవారం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలోడు అడవుల్లో మావోయిస్టులు నిర్మించిన భారీ స్తూపాన్ని బలగాలు గుర్తించి, కూల్చివేశాయి. కాగా పలోడు అడవులు మావోయిస్టులకు కంచుకోట, నిత్యం మావోయిస్టుల సంచారం ఉంటుంది. ఇప్పటి వరకు బలగాలు ఆ అడవుల్లో కూబింగ్ చేసిన ఘటనలు లేవు. నేడు ఆ ప్రాంతానికి బలగాలు చేరుకుని 15 మీటర్లు ఎతైన స్తూపాన్ని కూల్చివేశాయి. అడవుల్లో గాలింపుని ముమ్మరం చేశాయి. ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రం రాయగడ్ జిల్లాలో ఓ మహిళ పురిటి నొప్పులతో బాధపడుతోంది. రహదారి సౌకర్యం లేక కుటుంబ సభ్యులు జెట్టి కట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, అక్కడికి చేరుకుని మూడు కిలోమీటర్లు జెట్టిని మొసుకుని వెళ్లారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● ఆటో డ్రైవర్ మృతి

బూర్గంపాడు, జూలై 15: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని గొమ్మూరు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మండలం సీతారాంనగరం గ్రామానికి చెందిన ఐతం రాజు శ్రీను(34) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆటో వేసుకుని భద్రాచలం నుంచి ఇంటికి వెళ్తుండగా, భద్రాచలం డిపోకు చెందిన బస్సు ఖమ్మం నుంచి భద్రాచలం వైపునకు వెళ్తుండగా మండల పరిధిలోని గొమ్మూరు ఇసుక ర్యాంపు సమీపంలో ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకొని, ఆటోలో ఇరుక్కుపోయిన మృతదేహన్ని స్థానికుల సహాయంతో శ్రమించి బయటకు తీసి, ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం మృతుడు భార్య రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి, కు టుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యుత్ వైర్ దొంగ అరెస్టు

వైరా, జూలై 15: వైరాలో మూడురోజుల కిందట గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్‌కు చెందిన విద్యుత్ వైర్(అల్యూమినియం)చోరీ చేసిన వ్యక్తిని వైరా పోలీసులు అరెస్టు చేశారు. వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగాల నర్సింహారావును అరెస్టు చేసి చోరీ చేసిన విద్యుత్‌వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం వైరా పాత బస్టాండ్ సెంటర్లో జాతీయ ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా నర్సింహారావు తన ట్రాలీ ఆటోలో విద్యుత్ వైర్‌ను తరలిస్తుండగా, పోలీసు లు వెంబడించి పట్టుకొని తనిఖీ చేశారు. పోలీసులు విచారించడంతో ఈనెల 11న తానే ఈ విద్యుత్ వైర్‌ను అపహరించానని అంగీకరించాడు. వెంటనే అతడిని అరెస్టు చేసి వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

● ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు

జూలూరుపాడు, జూలై 15: మండల కేంద్రంలో పలు జూలూరుపాడులోని కిరాణా, పాన్ షాపులలో సోమవారం సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ రాణాప్రతాప్ తనిఖీలు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. రెండు దుకాణాల్లో ప్రభు త్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు పట్టుబడగా, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గుట్కా ప్యా కెట్ల విలువ రూ. 12,500 ఉంటుందన్నారు. వ్యాపారులు మిట్టపల్లి మణికంఠ, బాణోత్ ప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ దయినంద్, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక
విద్యార్థిని ఆత్మహత్య

● రావినూతలలో ఘటన

బోనకల్, జూలై 15: కడుపునొప్పి తాళలేక ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని రావినూతల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయినపల్లి అచ్యుతరావు, దుర్గమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె బోయినపల్లి రిషిత(17) మధిరలోని గురుకుల పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసింది. కాగా కడుపునొప్పి తాళలేక క్రిమిసంహారక మందు తాగింది. కాగా అదే సమయంలో ఆమె సోదరి ఇంటికి వచ్చి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్న అక్కను చూసి కేకలు వేసింది. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓఆసుపత్రికి తరలించగా విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సం ఘటనపై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

జూలూరుపాడు, జూలై 15: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని జూలూరుపాడులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెరుకుమల్లి సురేష్(34) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలి

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన


వినతిపత్రాలు స్వీకరిస్తున్న దృశ్యం

కొత్తగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశమందిరంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి గన్యాతో కలిసి అన్నిశాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సిపార్సు చేశారు. ఆమె దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీల ఆందోళన
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా


ఇల్లెందులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇల్లెందు టౌన్, జూలై 15: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతంచేస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు ఈసం వెంకటమ్మ, అబ్దుల్‌నబీలు హెచ్చరించారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యక్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రోజంతా సుమారు 10గంటల పాటు ఈ ధర్నా కార్యక్రమం కొనసాగింది. సభలో వారు మాట్లాడుతూ జీవో నెం: 10ని వెంటనే రద్దు చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తల బలవంతపు పదవీవిరమణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పదవీవిరమణ పొందిన కార్యకర్తలకు, ఆయాలకు సగం జీతం పెన్షన్ రూపంలో చెల్లించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలోఉన్నప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన శిభిరాల వద్దకు వచ్చి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే హామీ

అంగన్‌వాడీ ధర్నా సమాచారం తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలపై 24నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్త్రీ, శిశుసంక్షేమశాఖామంత్రి సీతక్క దృష్టికి సమస్యనుతీసుకెళ్తానని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి కాళంగి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భయ్యా అభిమాన్యుఅంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసం వద్ద అంగన్‌వాడీ టీచర్లధర్నా

●దమ్మపేట: గండుగులపల్లిలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాసం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలంటూ అశ్వారావుపేట, దమ్మపేట మండలాల అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు ధర్నా చేశారు. దాదాపు గంట పాటు ఎమ్మెల్యే నివాసం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పీఏ రవికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ సూరమ్మ, జ్యోతి, శాంతి, రాధ, కృష్ణవేణి, రాజేశ్వరి, రాజ్యలక్ష్మి సీపీఎం నాయకులు రమేష్, శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

●మణుగూరుటౌన్: అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్‌ల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుటు అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎంవీ అప్పారావు, నాయకులు సత్రపల్లి సాంబశివరాలు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సీఐటీయు నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, గద్దల శ్రీనివాసరావు, హేమలత, సుజాత, నాగమణి, భవాని, ప్రమీల, విజయ, సులోచన, లీల, జమునిషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా

●భద్రాచలం: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపుతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకొని వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యురాలు జీలకర్ర పద్మ, పట్టణ కన్వీనరు ఎంబి నర్సారెడ్డి, గడ్డం స్వామి, ఎర్రంశెట్టి వెంకట రామారావు, బండారు శరత్‌బాబు, అప్పారి రాము, చుక్కా మాధవరావు, నాగరాజు, లక్ష్మణ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జరగరానిది జరిగితే ఎవరిది బాధ్యత!

- రెండో వారధి సైడ్‌వాల్స్ నిర్మాణం వదిలేశారు
- దృష్టి సారించని ఉన్నతాధికారులు
- ఆందోళన చెందుతున్న వాహన చోదకులు


సైడ్‌వాల్స్ లేక ప్రమాదకరంగా ఉన్న రెండో వారధి

భద్రాచలం, జూలై 15: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోని వారధి. భద్రాచలం వద్ద గోదావరిపై ఇటీవల రెండో వారధి నిర్మాణం పూర్తి చేసి ఏప్రిల్ 15న రాకపోకలను అధికారికంగా ప్రారంభించారు. శ్రీరామనవమిని దృష్టిలో ఉంచుకొని ఆనాడు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి సౌకర్యార్థం మొదటి రహదారిపై రద్దీని తగ్గించేందుకు ఆనాడు రెండో రహదారిపై రాకపోకలను అనుమతించారు. ఈ సమయంలో ఉన్నతాధికారులు సైడ్‌వాల్స్ మూడు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. మూడు నెలలు కావస్తున్నా ఇంకా ఇందుకు సంబంధించిన పనులు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో 166వ కి.మీ. వద్ద వంతెన నిర్మాణానికి 2014లో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. 2015 ఏప్రిల్ ఒకటిన పనులు ప్రారంభం కాగా రూ.65 కోట్లతో పనులు చేపట్టారు. మొత్తం 2.3 కి.మీ. నిర్మాణంలో 1.25 కి.మీ. పొడవుతో వంతెన ఏర్పాటు చేశారు. పదేళ్ల క్రితం ఈ వారధి నిర్మాణం చేపట్టగా తొలి నుంచి పనులు నత్తనడకనే సాగాయి. నాటి రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా పలుమార్లు అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. శ్రీరామ నవమి నాటికి వారధి నిర్మాణం జరిగిందంటే అది తుమ్మల చలవేనని భద్రాద్రివాసులు, రామ భక్తులు పేర్కొంటున్నారు. కాని నాలుగు రాష్ట్రాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తున్న ఇంతటి ప్రధాన రహదారిపై సైడ్‌వాల్స్ నిర్మాణం చేపట్టకపోవడం పట్ల వాహన చోదకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రెండో వారధిపై ఏ మాత్రం అజాగ్రత్త వహించినా జరగరాని ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని వారు ఆందోళన చెందుతున్నారు. రెండో వారధిపై ఇంకా దీపాలు సైతం పెట్టకపోవడం, సైడ్ వాల్స్ లేని చోట కనీసం ప్రమాద సూచికలు సైతం ఏర్పాటు చేయకపోవడం ఎంత వరకు సమంజసమని వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మిగిలిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

జూలూరుపాడు, జూలై 15: మండలంలోని గుండెపుడి పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి హారికకు గుండెపుడిలో నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం ప్రజలను తీవ్రంగా వేదిస్తుందని, వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు దోమల బారిన పడుతున్నారని తెలిపారు. గ్రామంలో కోతులు, కుక్కలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేసి బ్లీచింగ్ చల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వల్లమల్ల చందర్ రావు, బాణోత్ మధు, దానయ్య యశ్వంత్, దనమయ్య పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగేలా చర్యలు

ఇల్లెందుటౌన్, జూలై 15: ఇల్లెందు పట్టణంలోని వివిధ వార్డుల్లో వర్షాకాలం సీజన్ దృష్ట్యా వీధిలైట్లు వెలిగేవిధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలమూలంగా వీధిలైట్లలో కార్బన్‌చేరడంతో అక్కడక్కడ వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లపై ప్రత్యేక కార్యచరణ చేపట్టి ప్రతి వీధిలైటు వెలిగేలా చూడాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనమాట్లాడుతు నీరు కలుషితం కాకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లీచింగ్ ఆలాం కలిపిన నీరు సరఫరా చేయాలని సూచించారు. వార్డుల్లో వీధిలైట్లపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో 3వ వార్డు కౌన్సిలర్ కొప్పుల రాజేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న రాళ్లవాగు..

పాల్వంచ రూరల్, జూలై 15: మండలంలోని అటవీ ప్రాంతంలో గల రాళ్లవాగు పొంగి ప్రవహిస్తోంది. రాళ్లవాగు పికప్‌డ్యామ్ అలుగు పారడంతో నీరంతా కిన్నెరసానిలో కలుస్తుంది. యానంబైలు, కారెగట్టు, రెడ్డిగూడెం, నర్సంపేట, పాండురంగాపురం శివారు ప్రాంతాల్లోని 3వేల ఎకరాలకు పైగా ఈ పికప్‌డ్యాం ఆధారంగా పంటలు పండుతాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటికి రాళ్లవాగు నిండి అలుగుపై నుంచి నీరు పొంగి ప్రవహిస్తుంది.

వ్యక్తిగత జాగ్రత్తలు అవసరం

అశ్వారావుపేట రూరల్, జూలై 15: వ్యాధుల సీజన్ ఆరంభమైన తరుణంలో రోగాలు ప్రబలకుండా ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు కూడా తీసుకోవాలని వైద్యులు రాందాస్ నాయక్ సూచించారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుదుములపాడులో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్యులు రాందాస్ నాయక్ గ్రామస్తులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఈవో రాజు, హెచ్ఎస్ శ్రీను, ఆరోగ్య సహాయకులు రవి, వెంకటలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలను మెరుగుపర్చాలి: కౌన్సిలర్లు

ఇల్లెందుటౌన్, జూలై 15 : మున్సిపాలిటీలో పారిశుధ్య చర్యలను మెరుగుపర్చాలని కోరుతూ ఇల్లెందు మున్సిపల్ కమీషనర్ యాదగిరికి సోమవారం బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు వినతిపత్రం అందచేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అదేవిదంగా వీధిలైట్లు ఏర్పాటుచేయాలని కమీషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జేకే. శ్రీనివాస్, చీమల సుజాత, లలిత, శారద, యలమందుల వీణ, చందా బిందు, సిలివేరు అణిత, పాబోలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతపై అవగాహన సదస్సు

ఇల్లెందుటౌన్, జూలై 15 : సింగరేణి ఇల్లెందు ఏరియాలోని పిట్‌కమిటీలు, ఇతర అధికారులకు భద్రత, రక్షణపై సోమవారం వీటీసీలో నిర్వహించారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్‌మాట్లాడుతూ సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంపొందించేందుకు భద్రత, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. సురక్షితమైన ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించడంలో భద్రత థోరణి కార్యక్రమం ఎంతో కీలకమని, ప్రమాదాలను గుర్తించడానికి, ప్రతి స్పందించడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను ఉద్యోగులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం మల్లారపు మల్లయ్య, అధికార సంఘం అధ్యక్షులు శివ ప్రసాద్, ఎంవీటీసీ మేనేజరు మహేష్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు నజీర్ అహ్మద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు

అశ్వాపురం జూలై 15: మణుగూరు హెవీవాటర్‌ప్లాంట్ ఈసీసీ స్టోర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఆటమిక్‌ఎనర్జీ సెంట్రల్ స్కూల్‌లో గ్యాస్ వినియోగం, రక్షణచర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు. గ్యాస్‌వినియోగంపై ఈసీసీ సెక్రటరీ టీఎస్‌పీ రవికుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్విజ్ పోటీ విజేతలకు ప్లాంట్ జీఎం జగ్గారావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీజీఎంలు శ్రీనివాస్, జగన్నాదవర్మ, సీఏఓ వేణు,సెంట్రల్‌స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రుక్మగంధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'


అశ్వారావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట రూరల్/టేకులపల్లి, జూలై 15: మండలంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని సీడీపీవో రోజారాణి ప్రారంభించారు. ప్రారంభకార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రోజారాణి మాట్లాడుతూ ఈనెల 20వరకు వారం రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. వారం రోజుల పాటు పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామన్నారు. పేద పిల్లలకు కార్పోరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం సిలబస్ ఉంటుందని తెలిపారు. చిన్నారులకు త్వరలో యూనిఫాం కూడా అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ నర్సమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సులానగర్‌లో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ టేకులపల్లి సీడీపీవో మంగతార, ప్రీస్కూల్ కరికులం మాస్టర్ ట్రైనర్స్ రమాదేవి, నాగమణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు అనురాధ, సక్కుబాయి, లక్ష్మి, నిర్మల, యశోదమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

చంద్రుగొండలో డ్రైయినేజీ నిర్మించాలని ధర్నా

చంద్రుగొండ, జూలై 15: చంద్రుగొండ నుంచి జూలూరుపాడు వెళ్లే రహదారికి ఇరువైపులా డ్రైయినేజీ నిర్మించాలని సోమవారం చంద్రుగొండ గ్రామస్థులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. చంద్రుగొండ ప్రధాన సెంటర్ నుంచి గ్రామంలో 1300 మీటర్ల పొడవు డ్రైయిన్ నిర్మాణానికి రూ.3.12 కోట్లు మంజూరయ్యాయి. తీరా పనులు ప్రారంభించే సయానికి డ్రైయిన్ నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోతున్నవారి నుంచి తీవ్ర ప్రతిఘటన రావటంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో డ్రైయినేజీ లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు వెంటనే డ్రైయిన్ నిర్మాంచాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈసమయంలో ట్రాఫిక్ జామ్ కావటంతో ఎస్ఐ స్వప్న జోక్యం చేసుకొని ఆందోళన విరమించి, చర్చిల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని కోరారు. దీంతో గ్రామస్తులు అందళోన విరమించారు,

కన్నుల పండువగా చిన సరిగెత్తు వేడుకలు


పీరీల ఊరేగింపు

కరకగూడెం, జూలై 15: మండల కేంద్రంలోని పీరీల గుడి(దర్గ) వద్ద సోమవారం ఉదయం చిన్న సరిగెత్తు కన్నుల పండుగగా జరిగింది. దర్గ వద్ద మొహర్రం సందర్భంగా వారం రోజులుగా పీరీలను(సవర్లు) కొలువు తీర్చిన మూజావార్లు సోమవారం ఉదయం చికటితో పీరీలను నిద్ర లేపారు. అనంతరం సవర్లను పూనకాలతో ఎత్తుకున్న మూజావార్లు అగ్ని గుండంలో దాటారు. అక్కడకు వచ్చిన భక్తులకు మొక్కులు చెల్లించారు. పెద్ద సరిగెత్తు కార్యక్రమంకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ములుగు, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి

దుమ్ముగూడెం జూలై 15: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసీ చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ లక్ష్మి, దామోదరావు, రాముడు, మల్లు, ఆదినారాయణ, హరికృష్ణ, కామేష్, సీతయ్య, బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల వితరణ

లక్ష్మిదేవిపల్లి, జూలై 15: నిరుపేద కుటుంబానికి 35 వార్డు కౌన్సిలర్ బండారు రుక్మగందర్ పుట్టన రోజును పురస్కరించుకుని సోమవారం నిత్యావసర వస్తువులు అందచేసి తన ఔదర్యాన్ని చాటుకున్నారు. పట్టణానికి చెందిన భాస్కర్ పక్షవాతంకు గురై కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ ఆ కుటుంబానికి రూ.3వేల విలువ చేసే సరుకులను అందచేశారు. ఈ సందర్భంగా పలువురు దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

గంగోలులో వెలిగిన విద్యుత్ దీపాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుమ్ముగూడెం జూలై 15: గంగోలు గ్రామ పంచాయతీ పరిదిలో వీది దీపాలు ఎట్టకేలకు సోమవారం వెలిగాయి. విద్యుత్‌శాఖ దత్తత గ్రామం గంగోలు పంచాయతీలో ఇరవై రోజులకు పైగా వీది దీపాలు వెలగని విషయమై ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి'లో దత్తత గ్రామంలో వెలగని విద్యుత్ దీపాలనే కథనం వెలువడింది. లైను మరమ్మతులకు గురవడంతో దీపాలు వెలగక పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరించింది. స్పందించిన ఏఈ మోహన్ రెడ్డి సోమవారం పంచాయతీ విద్యుత్‌లైనులో మరమతులు చేయించారు. 'ఆంధ్రజ్యోతి'ని స్థానికులభినందించారు.

సంతటెండర్లలో అవినీతిపై విచారణ జరిపించాలి: బీఎస్పీ

కొత్తగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో వారంతపు సంత టెండర్లలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి సంత టెండర్‌నురద్దు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారంతపు సంత టెండరు రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ప్లేకార్డులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందనకు వినతిపత్రం అందజేశారు. టెండర్లు రద్దు చేయాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, రంజిత్, సరోజ, కళ్యాణ్, అజయ్ తదతరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో డీటీ తనిఖీలు

మణుగూరుటౌన్/అశ్వాపురం, జూలై 15: మణుగూరు, అశ్వాపురం మండలాల్లోని రేషన్ షాపులను సివిల్ సప్లయ్ డీటీ శివకుమార్ సోమవారం తనికి చేశారు. ఇందులో బాగంగా మణుగూరు మండలంలోని సమితిసింగారం, ముత్యాలమ్మనగర్, బండారుగూడెంలతో పాటు తదితర షాపులను తనికీ చేశారు. షాపుల్లోని రికార్డులను రిశీలించారు. స్టాక్, రికార్డులను మెయింటేన్ చేయడంలో ఏమైన పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా స్టోర్ కీపర్‌లను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతీనెల మొదటి రెండు వారాల్లో తనికీలు నిర్వహిస్తామని, సాధారణ తనికీల్లో బాగంగానే షాపులను, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల, కళాశాలల్లో బదిలీలు

భద్రాచలం, జూలై 15: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, నాల్గొవ తరగతి సిబ్బందికి ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలను సోమవారం గురుకులం ఖమ్మం రీజియన్ వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. 26 మంది సిబ్బందిని వివిద ప్రాంతాల్లో బదిలీలలను కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో నరేందర్, పర్యవేక్షకులు కృష్ణార్జున్, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి: పీవోడబ్ల్యూ

అశ్వారావుపేట రూరల్, జూలై 15: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. ప్రజాపంథా కార్యాలయంలో సోమవారం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. మండల అధ్యక్షురాలు గోఖినేపల్లి గంగా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, డివిజన్ కార్యదర్శి తోడెం దుర్గమ్మ, కంగాల భూలక్ష్మి, కొల్లూరి పద్మ, కొంద్రు లక్ష్మి, వీరమ్మ, తెల్లం బంగారమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

'సీతారామ' నీటిని ఏజెన్సీకి కేటాయించాలని వినతి


భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందుటౌన్, జూలై 15: సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాలకు మళ్లించాలని కోరుతూ గోదావరి జలాల సాధనకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సాధనకమిటీ సభ్యులు బందెం నాగయ్య, ఆలేటి కిరణ్‌కుమార్, నూకలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోదావరి నది జలాలపై నిర్మించే ఎత్తిపోతుల దుమ్ముగూడెం ప్రాజెక్టు పేరు మార్చి సీతారామ ప్రాజెక్టుగా నామకరణ చేసినప్పటికీ రోళ్లపాడు చెరువుకు నీటిని మళ్లించకుండ పాలకులు స్వార్థపూరిత విధానాలతో ప్రాజెక్టు డిజైన్ మార్చారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు బుర్రా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రోటరీ సేవలు మరింత విస్తరించాలి: ఎమ్మెల్యే తెల్లం


నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, జూలై 15: భద్రాచలం ఏజెన్సీలో రోటరీ సేవలు మరింతగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన కార్యవర్గంను ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదలు, విపత్తుల సమయంలో స్వచ్ఛంద సంస్థల సేవలు మరువలేనివని అన్నారు. రోటరీ క్లబ్ భద్రాచలం నూతన అధ్యక్షుడిగా దారా బాలాజీరావు, కార్యదర్శిగా నూకల విద్యాసాగర్, కోశాధికారిగా వందవాసు శ్రీనివాసరావులతో డిస్ట్రిక్ట్ గవర్నరు మల్లాది వాసుదేవరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలివెల రవికుమార్, మోతుకూరి వీరయ్య, వాసిరెడ్డి అజయ్‌కుమార్, యశోద రామచందర్‌రావు, రాజా రెడ్డి, బ్రహ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రావు,షేక్ అజీమ్, విష్ణు మొలకల వరలక్ష్మి పాల్గొన్నారు.

వెంకటాద్రి సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే

చర్ల, జూలై 15: స్వాతంత్ర సమర యోధుడు, తామ్రపత్ర గ్రహీత, చింతల చెర్వు వెంకటాద్రి ఏజెన్సీ వాసులకు చేసిన సేవలు చిరస్మరణీయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కొనియాడారు. సోమవారం చర్ల మండలం రైజ్‌పేటలోని శైలజా విహార్‌లో వెంకటాద్రి 38వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీడీవో ఈదయ్య టీపీసీసీ సభ్యుడు దుర్గా ప్రసాద్, చీమల మర్రి మురళి కృష్ణ, సిహెచ్‌వీఆర్ మురళి మోహన్‌రావు, సివి రమణ, చీమకుర్తి వీరభద్రం, బండారు రామకృష్ణ, రౌతు నర్సింహారావు, ఆవుల విజయభాష్కర్ రెడ్డి ఉన్నారు.

గిరిజనులకు పోడు పట్టాలు ఇప్పించాలని వినతి

దమ్మపేట, జూలై 15: గండుగులపల్లి, మొండివర్రె గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు పోడు పట్టాలు ఇప్పించాలనీ ఐటీడీఏ భద్రాచంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఏపీవో డేవిడ్‌రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలలోని గిరిజనుకు ఏఒక్కరికి పోడు పట్టా రాలేదని జాబితా తమ పేర్లు వున్నా రాలేదని ఏపీవో దృష్టికి తీసుకువెళ్ళారు. తమకు పట్టాలు రాకపోవటంతో భూములు సాగు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం నుండి ఎటువంటి సౌకర్యాలు అందటం లేదని తెలిపారు. దీనిపై స్పందించన ఏపీవో మాట్లాడుతు పట్టాలు మంజూరు చేయటానికీ చిన్నచిన్న సమస్యలు వున్నాయని వాటిని పరిష్కరించి పట్టాలు అందజేస్తామని తెలిపారు. వినతీపత్రం అందజేసిన వారిలో ఎంపీపీ సోయం ప్రసాదు, కాసాని నాగప్రసాదు, సుశీలా రాజేష్ తదితరులున్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

మణుగూరుటౌన్, జూలై 15: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల కుటుంబాల పిల్లలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలను ఏరియా జీఎం దుర్గం రామచందర్ సోమవారం అందజేశారు. మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో ఉద్యోగల లభించడం ఓ వరంలాంటిదని, సంస్థలో ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ సంస్థతోపాటు కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలని నూతనంగా నియామక పత్రాలను అందుకున్న ఉద్యోగులకు సూచించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో ఒక యువతితో పాటు ముగ్గురు యువకులు ఉన్నారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం శ్యాంసుదర్, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు మేకల ఈశ్వర్, ప్రాతినిధ్య సంఘం నాయకులు షాబుద్దీన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి హోమం

చుంచుపల్లి, జూలై 15: మండల పరిధిలోని గౌతమ్‌పూర్ గ్రామం నందు గల శ్రీకనకదుర్గ చంద్రమౌళీశ్వర ఆలయంలో శ్రీ వారాహీ దేవి నవరాత్రులలో భాగంగా మహా పూర్ణ హుతి హోమాన్ని ఆలయ అర్చకులు అనిల్ శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా సోమవారం నిర్వహించారు. శ్రీవారాహీ దేవి పూజలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- కలెక్టర్ జితేష్ వీ పాటిల్

కొత్తగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళా మణులకు జీవనోపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా శక్తి అవగాహన సదస్సును ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహకారక సంఘాల ద్వారా వివిధ పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందన్నారు. మహిళా సంఘాలు ఏర్పాటుచేసే పరిశ్రమల్లో నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు చేరవేసి లక్ష్యాలను అధిగమించవచ్చన్నారు. మహిళా సంఘాలు కుటీర పరిశ్రమలైన పెరిటికోళ్లు, తేనెటీగల, ఆజోల, చేపలు, పాడి పశువుల పెంపకం, కుట్టుమిషన్, మీసేవ, ఆహార పదార్థాల తయారీ, డబ్బావాలా కేంద్రాలనుఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు శిక్షణను అందచేస్తామన్నారు. అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవో వారి లక్ష్యాల కోసం మహిళా సంఘాలపై ఒత్తిడి తేవద్దని అవగాహణ ఉన్న పరిశ్రమల ఏర్పాటుపై ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విద్యాచందన, జడ్పీ సీఈవో చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబు రావు, ఉద్యానవనశాఖ అధికారి సూర్యనారాయణ, పశు సంవర్ధకశాఖ అధికారి పురందేశ్వర్, అన్ని మండలాల ఎంపీడీవోలు, మహిళా సంఘ సభ్యుల్యు, కమ్యూనిటి కో ఆర్డినేటర్లు, ఆఫీసర్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జగన్నాథ రథయాత్ర



అశ్వాపురం జూలై 15: అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో ఈనెల 7న ప్రారంభమయిన జగన్నాథ రథయాత్ర సోమవారం సాయంత్రం జరిగిన బహుదాయాత్రతో వైభవంగా ముగిసింది. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఉద్యోగుల కు సంబంధించిన ఉత్కల్ పథాగర్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్రలో భాగంగా దేవతామూర్తులు జగన్నాథ స్వామి,బలబద్రస్వామి,సుభద్రాదేవిలు తమ మేనమామ ఇంటినుంచి పహండి గుహకు చేరటంతో రథయాత్ర ముగిసింది. ఈసందర్భంగా దేవతామూర్తులను ప్రత్యేక పల్లకీలలో ఉంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి పహండిగుహకు నిర్వాహకులు తోడ్కొని వచ్చారు. ముగింపు కార్యక్రమానికి హెవీవాటర్ ప్లాంట్ జీఎం జగ్గారావు ముఖ్యఅతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.